నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | మే 03, 2024 | www.navatelangana.com

జీపీ కార్మికులకు బకాయి వేతనాలు పంపిణీ చేయాలి

- తెలంగాణ గ్రామ పంచాయతి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆరు నెలల నుంచి జీతాలు పంపిణీ చేయడం లేదని తెలంగాణ గ్రామ పంచాయతి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ తెలిపారు. దానిని నిరసిస్తూ గురువారం సమ్మె ప్రారంభించారు. కార్యక్రమంలో టీ పండరి, కొప్పుల సుదర్శన్, సిహెచ్ గోపి, సిహెచ్ సాయిలు, సిహెచ్ లక్ష్మణ్, సావిత్రి, కె.సాయికుమార్, పి.రాజు, హైమద్ తదితరులు పాల్గొన్నారు.ఓ


సమ్మెలో పాల్గొన్న కార్మికులు

ఎడపల్లి ఎంపీడీవో దంపతులకు ఘన సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కే శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోతో పాటు ఆయన సతీమణికి మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో పాటు, ఎడపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి పూల బోకెను అందజేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొన్నారు.


ఎంపీడీవో దంపతులను సన్మానిస్తున్న పలువురు

కుల సంఘాలపై ఫోకస్

- ఓట్లు కొనేందుకు వ్యూహాలు
- సంఘం నాయకులతో సంప్రదింపులు

నవతెలంగాణ-లింగంపేట్

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీలు గెలిచేందుకు కుల సంఘాలపై దృష్టి పెట్టాయి. పార్లమెంట్ ఎన్నికలకు మరో 10 రోజులు గడువు ఉండడంతో అధికార కాంగ్రెస్, బిజెపి పార్టీలు వ్యూహాత్మకంగా ప్రచారంలో దూకుడు పెంచాయి. పోటాపోటీగా ముందుకు వెళుతున్నాయి. కుల సంఘాలపై దృష్టి పెట్టి మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ బిజెపి పార్టీలో కుల సంఘాలపై దృష్టి పెట్టి కోట్లు రాబట్టుకునేందుకు కుల సంఘాల పెద్దలతో చర్చించినట్లు సమాచారం. ప్రత్యర్థులను చిత్తు చేసేందుకు వ్యూహాత్మకంగా ఇందుకోసం సామాజిక వర్గాల ఓట్ల కోసం ప్రణాళిక సిద్ధం చేసి ఇప్పటికే గ్రామాల వారిగా మండలాల వారిగా కుల సంఘాల పెద్దలతో రహస్యంగా



మంతనాలు జరుపుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండడంతో ఎంపీ అభ్యర్థి ప్రతి గ్రామాన్ని తిరగలేకపోయారు. ప్రతి గ్రామానికి వెళ్లి ప్రచారం చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపి స్థానం పరిధిలో ఎక్కువగా ఓటర్లు ఉండడం వారిని తమ వైపు తిప్పుకోవడానికి కుల సంఘాలు మహిళలు, యువజన సంఘాలు, వ్యాపారులు, కార్మిక సంఘాల వారితో సమావేశాలు నిర్వహిస్తూ సంపూర్ణ మద్దతు ప్రకటించాలని వారు వేడుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే రాష్ట్రస్థాయి నాయకులను కుల సంఘాల పెద్దలను రంగంలోకి దించి కుల సంఘాల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బీజేపీ సామాజిక వర్గాల కులాలను ఓట్లను తమ వైపు తిప్పుకోవడానికి ఈటల రాజేందర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి సమావేశం ఏర్పాటు చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ గత మూడు రోజుల క్రితం బాన్సువాడ నియోజకవర్గంలో గిరిజన తెగకు చెందిన వారితో సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తలను భరోసా ఇస్తూ వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని వేడుకున్నారు.

కుల పెద్దలతో సంప్రదింపులు..

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒకవైపు ప్రచారానికి పదును పెడుతూ మరోవైపు కుల సంఘాలపై దృష్టి పెట్టి కుల సంఘాల పెద్దలతో సంప్రదిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే నియోజకవర్గంలో గ్రామాల, మండలాల వారీగా కుల పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నారు. సామాజిక వర్గాల ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ పలుకుబడి ఉన్న నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

ప్రధాన పార్టీల దృష్టి కుల సంఘాలపై..

కుల సంఘాల ఓట్లపై ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపి పార్టీలు దృష్టిపెట్టాయి. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో 16,32,266 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ముఖ్యంగా జుక్కల్, మద్నూర్, నారాయణఖేడ్, బిచ్కుంద, ఆందోల్, జహీరాబాద్ నియోజకవర్గంలో లింగాయతులు కులానికి చెందినవారు అధికంగా ఉన్నారు. అదేవిధంగా ముదిరాజ్, మున్నూరు కాపు, పద్మశాలి, మైనార్టీ, వైశ్య, ఎస్సీ, ఎస్టీ ఓట్లు అధికంగా ఉన్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ బిజెపి అభ్యర్థులు లింగాయత్ సామాజిక వర్గాలకు అనుకూలంగా ఉన్నారు. బిఆర్ఎస్ పార్టీ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన గాలి అనిల్ కుమార్‌కు ప్రకటించింది.

జోరుగా ఎన్నికల ప్రచారం

సభలకు, ప్రచారానికి హాజరైన వారికి.. కూలి రూ.200

నవతెలంగాణ-బోధన్

గ్రామాలలో ఓట్ల సందడి జోరందుకుంది. అలాగే ఎంపీ అభ్యర్థుల పర్యటన, ప్రచారం కొనసాగుతున్నాయి. దాంతో ప్రధాన గ్రామాలలో నాయకులు అభ్యర్థులతో ప్రచార సభలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార సభలు జనంతో సక్సెస్ కావడానికి నాయకులు శ్రమించవలసి వస్తుంది. దాంతో అభ్యర్థుల వద్ద తమ పలుకుబడి పెరగడానికి జన సమీకరణకు కష్టపడుతున్నారు. దాంతో మహిళలకు ఒక్కొకరికి రూ.200 నుంచి రూ.250 రూపాయలు చెల్లించి ప్రచార సభలకు తరలిస్తున్నారు. మహిళలు కూడా పోటీపడి ప్రచారానికి వెళ్తున్నారు. ఏ పార్టీ వారు వచ్చిన వారికి సమయమిచ్చి ఆ సమయంలో ప్రచారానికి వెళ్లడానికి బేరం కుదుర్చుకుంటున్నారు. దాంతో నాయకుల రాకతో కాలనీలు కళకళలాడుతున్నాయి.


ఓ పార్టీ ప్రచార సభకు వచ్చిన మహిళలు

ఉపాధి కూలీల వద్దకే ఎన్నికల ప్రచారం...

గ్రామీణ ప్రాంతాలలో జనం ఉదయం ఏడు గంటలకే ఉపాధి హామీ కూలీ పనులకు తరలివెళ్లడంతో కాలనీలలో జనం లేక బోసిపోతున్నాయి. దాంతో ఎన్నికల ప్రచారం నిర్వహించవలసిన నాయకులు వారు కూడా రూటు మార్చి కాలనీలలో కాకుండా ఏకంగా ఉపాధి హామీ పనిచేస్తున్న స్థలం వద్దకే వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. దాంతో కూలీలు వారి పనులు ఆపేసి నాయకుల చెప్పే మాటలు వినవలసి వస్తుంది. అలాగే ఎండ వేడిమి వలన, ఉష్ణోగ్రత తీవ్రవలన పొద్దంతా నాయకులు ఎన్నికల ప్రచారం నిలిపివేస్తున్నారు. సాయంత్రం ఆరు తర్వాతనే గ్రామాలకు వెళ్లి కాలనీలలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. దాంతో రాత్రి వేళ గ్రామాలలో ఎన్నికల ప్రచార సందడి నెలకొంది. పనిలో పనిగా ముఖ్య నాయకులు అభ్యర్థులు నాయకుల విన్నపం మేరకు పలు గ్రామాలకు హాజరు కావడంతో స్థానిక నాయకులు వారి పలుకుబడిని ఉపయోగించి మందిని తరలిస్తున్నారు. కొంతమంది ముఖ్య నాయకులు అభ్యర్థుల వద్ద మరింత పలుకుబడి పెంచుకోవడానికి ఇప్పటినుంచి శ్రమిస్తున్నారు. ఎందుకంటే భవిష్యత్తులో పార్టీ పదవులకు గాని ఇతరత్ర పదవులకు గాని నాయకులు తమను ఆదుకుంటారని వారి ఆలోచన. దాంతో గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల్లో ఉన్న ముఖ్య నేతలు కార్యకర్తలు జోరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఏదేమైనా మరో పది రోజుల్లో ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రచారం వలన మహిళలకు ఎంత కొంత కూలి డబ్బులు రావడంతో మహిళలు ఏ పార్టీ అయితే మాకేంటి డబ్బులు ఇస్తే వస్తాం అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

ఓటు ప్రజాస్వామ్యానికి పునాది

- స్వీప్ నోడల్ అధికారి వెంకటేష్

నవతెలంగాణ-కామారెడ్డి

ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటు అనే రెండక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుందని స్వీప్ నోడల్ అధికారి వెంకటేష్ అన్నారు. స్వీప్ కార్యక్రమాలలో భాగంగా గురువారం వాక్ టు పోలింగ్‌స్టేషన్ కార్యక్రామాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తక్కువ శాతం ఓటింగ్ నమోదైన కామారెడ్డి పట్టణంలోని 245వ పోలింగ్ బూతును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ గతిని మార్చే ఓటు అనే వజ్రాయుధం మీ చేతిలో ఉందని, ఓటు ప్రాముఖ్యతను గుర్తెరిగి మే 13న జరగబోయే పార్లమెంటు ఎన్నికలల్లో తప్పక ఓటు వేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం బాగున్నా పట్టణ ప్రాంతాలలో వివిధ కారణాలరీత్యా తక్కువ శాతం ఓటింగ్ నమోదవుతున్నదని అన్నారు. వేసవి తీవ్రత, పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ తక్కువగా నమోదు కావడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని, వివిధ వర్గాల అభ్యర్థన మేరకు భారత ఎన్నికల సంఘం ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలలో పోలింగ్ సమయాన్ని ఒక గంట ఎక్కువ చేసిందని అన్నారు. వాస్తవానికి సాధారణ ఎన్నికలలో పోలింగ్ ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉండగా, ఈ సారి మాత్రం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని అన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున సాధ్యమైనంత వరకు ఉదయం వేళలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, మీతో పాటు మీ కుటుంబ సభ్యులు, చుట్టుప్రక్కల వారు ఓటు వేసేలా అవగాహన కలిగించాలని వంద శాతం ఓటింగ్ జరగాలని అన్నారు. అనంతరం ఓటు ప్రాముఖ్యత, నేను ఖచ్చితంగా ఓటేస్తాను అని ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జనార్దన్, బూతుస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న నోడల్ అధికారి

అక్రమాలకు పాల్పడితే చర్యలు

- జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-నిజాంసాగర్

ధాన్యం కొనుగోళ్లలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ తెలిపారు. బుధవారం నవతెలంగాణ దినపత్రికలో 'కొటింగ్ పేరుతో లూటీ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఆయన జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు ధాన్యానికి సంబంధించి ఏదైనా కటింగ్ చేస్తే ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ జరిపి వెంటనే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

హీరీభాయిది వడదెబ్బ మృతి కాదు.. గుండెపోటుతో మరణించింది..

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.లక్ష్మణ్ సింగ్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని మహమ్మద్‌నగర్ మండలం గిర్నీ తండాకు చెందిన కడవత్ హీరీభాయి గుండెపోటుతో మరణించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.లక్ష్మణ్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దినపత్రికలలో వడదెబ్బతో మృతి శీర్షికన వచ్చిన వార్తకు స్పందించి విచారణ చేయగా హీరీభాయి ఏప్రిల్ 29న మధ్యాహ్నం 2గంటలకు ఇంటి ముందర ధాన్యం ఆరబెడుతుండగానే ఆకస్మాత్తుగా రెండున్నర గంటలకు విపరీతమైన చెమటతో ఛాతిలో నొప్పిరాగా యాంటాసిడ్ టాబ్లెట్ వేసి విశ్రాంతి తీసుకోమని చెప్పి మా పనులలో నిమగ్నమై తిరిగి 4 గంటలకు వచ్చి చూసిన తరువాత ఆమె విఘత జీవిగా కనిపించిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారని లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లలేదని, ఇంటివద్దనే మరణించిందన్నారు. హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్న హీరీభాయి సాధారణ మందులు తీసుకుంటుండేదని తమ విచారణలో తేలిందని, నిజాంసాగర్ పిహెచ్‌సి డాక్టర్లు విచారణ చేసి గుండెపోటుతో మరణించారని ధ్రువీకరించారని ఆయన తెలిపారు.

రెంజల్ ఇంచార్జ్ ఎంపీడీవోగా హెచ్.శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-రెంజల్

మండల ఇన్చార్జ్ ఎంపీడీవోగా హెచ్.శ్రీనివాస్ గురువారం బాధ్యతలను చేపట్టారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.


ఇంచార్జి ఎంపీడీవోకు సన్మానం

పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులు
- కీలక సూచనలు చేసిన జనరల్ అబ్జర్వర్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలన జరిపేందుకు వీలుగా నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ శిక్షణ కార్యక్రమానికి విచ్చేసి మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలలో పరిశీలన బాధ్యతలు కేటాయించనున్నట్టు తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగలుగుతారని అన్నారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందు రోజు ఉదయం 7గంటల సమయానికే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా అందినదా లేదా అన్నది పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ నిర్వహించారా లేదా అన్నది పరిశీలించాలని, ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకే మాక్ పోల్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఒకవేళ ఏజెంట్లు ఎవరూ హాజరు కాని పక్షంలో 15 నిమిషాలు వేచి చూసిన మీదట మైక్రో అబ్జర్వర్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మాక్ పోల్, తదనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియలు నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా అన్నది నిశిత పరిశీలన చేయాలని, గమనించిన అంశాలను జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలూ ఉన్నాయా లేవా అన్నది గమనించాలని, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ సరిగానే ఏర్పాటు చేశారా అన్నది పరిశీలించాలన్నారు. ఎక్కడైనా సాంకేతిక లోపాల వల్ల ఈ.వీ.ఎంలు పనిచేయకపోతే, వాటి స్థానంలో వేరే ఈ.వీ.ఎంలను ఎలా అమరుస్తున్నారు అన్నది పరిశీలన చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వర్తిసున్న విధులను గమనించాలని, టెండర్, ఛాలెంజ్ ఓటింగ్‌లు జరిగితే వాటి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అయితే పోలింగ్ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించడం వరకే మైక్రో అబ్జర్వర్ల బాధ్యత అని, ఎక్కడ కూడా పోలింగ్ విధుల్లో జోక్యం చేసుకోకూడదని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలను గమనిస్తూ, ఎప్పటికప్పుడు వాటిని జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైకో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఆరు గంటల లోపు పోలింగ్ కేంద్రం లోనికి వచ్చిన ఓటర్లు ఇంకను మిగిలి ఉంటే, వారిని వరుసక్రమంలో నిలబెట్టి చివరి నుంచి ముందు వరుసలో ఉన్న ఓటరు వరకు క్రమ సంఖ్య చీటీలు అందించి పోలింగ్ జరిపించాల్సి ఉంటుందన్నారు. ఈ అంశాలన్నింటినీ మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, పోలింగ్ కేంద్రం బయట, పరిసర ప్రాంతాల్లోనూ జరిగే అంశాలను గమనిస్తూ జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ప్రభావితం చేయకుండా నిఘా ఉంచాలని, ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వారు మినహా, ఇతరులెవరిని పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతుల్లో సూచించిన అంశాలను చక్కగా ఆకళింపు చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


శిక్షణలో పాల్గొన్న అబ్జర్వర్లు

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం

- జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని అడ్లూర్, అడ్లూర్ ఎస్సి కాలనీలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ గురువారం ప్రారంభించామని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు అన్నారు. గురువారం కామారెడ్డి మండలం అడ్లూర్, ఇస్రోజీవాడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందంతో కలిసి పరిశీలించారు. అడ్లూర్‌లో కేంద్రాలను ధాన్యం రాసులు వస్తున్నందున కేంద్రాలను ఏర్పాటు చేసి మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. కాగా జిల్లాలో ఇప్పటి వరకు 28,189 మంది రైతుల నుంచి 342 కోట్ల విలువగల ఒక లక్ష 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 235 కోట్లు చెల్లించామని అన్నారు. ఇదే రోజు గత సంవత్సరం యాసంగిలో 45,483 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 13 కోట్ల 79 లక్షలు చెల్లించామని, గత సంవత్సరంతో పోలిస్తే రికార్డు స్థాయిలో ఒక లక్ష 10 వేల మెట్రిక్ టన్నుల మేర అధికంగా ధాన్యం కొనుగోళ్లు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించడంతో పాటు ధాన్యం వచ్చిన వెంటనే తూకం వేసి ట్యాగ్ చేసిన మిల్లులకు తరలిస్తూ వెంటవెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి డబ్బులను రైతుల ఖాతాలో వేస్తున్నామన్నారు. రైతులు కూడా ధాన్యాన్ని ప్యాడి క్లీనర్ ద్వారా శుభ్రపరచి, తాళ్లు లేకుండా, 17 శాతం తేమ మించకుండా నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యం తెచ్చి మద్దతు ధరను పొందవలసినదిగా సూచించారు. కేంద్రం నిర్వాహకులు కూడా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లు అందించాలన్నారు. మిల్లర్లు కూడా ఎటువంటి కటింగ్‌లు చేయవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-నిజాంసాగర్

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని ఆరేడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం స్వప్న (21) అనే వివాహిత అత్త, మామ వేధింపులు భరించలేక గురువారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు రెండేళ్ల పాప ఉంది. మృతురాలి తల్లి జంగిలి సాయవ్వ దరఖాస్తు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

4,5 తేదీల్లో హోమ్ ఓటింగ్ నిర్వహణ

- జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ఈ నెల 4,5 తేదీల్లో హోమ్ ఓటింగ్ నిర్వహించనున్నామని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్ గురువారం తెలిపారు. జిల్లాలో 85 సంవత్సరాలు పైబడిన 181 మంది వృద్ధులు, 258 మంది వికలాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకోనున్నారని అన్నారు. ఇందుకోసం 25 ప్రత్యేక హోమ్ ఓటింగ్ బృందాలను ఏర్పాటు చేసి 12 రూట్ల ద్వారా ఈ ప్రక్రియను కొనసాగించనున్నామని తెలిపారు. ఓటింగ్ గోప్యతను పాటిస్తూ పూర్తి పారదర్శకంగా నిర్వహించుటకు అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని, వీడియోగ్రఫీ చేస్తున్నామని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని రాజకీయ పార్టీలకు చేరవేశామని కలెక్టర్ తెలిపారు. హోమ్ ఓటింగ్ ఓటర్లు ఆయా తేదీలలో ఇంటివద్ద తప్పక ఉండి ఓటు హక్కును వినియోగించుకోవలసినదిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



అనుబంధ ర్యాండమైజేషన్ పూర్తి..

అనుబంధ ర్యాండమైజేషన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం ఈవీఎం గోదాంలో ఇటీవల హైకోర్టు ఆదేశాల మేరకు రిలీజ్ అయిన 791 ఈవీఎం లతో పాటు రిజర్వులో ఉన్న 191 కలిపి మొత్తం 990 ఈవీఎంల అనుబంధ ర్యాండమైజేషన్‌ను పూర్తి చేశారు. జహీరాబాద్ పార్లమెంటు స్థానానికి 19 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నందున అదనపు బ్యాలట్ యూనిట్ల అవసరం ఉన్నందున అనుబంధ ర్యాండమైజేషన్ చేశామని కలెక్టర్ తెలిపారు. ఇట్టి ఈవీఎంల మొదటి దశ పరిశీలన (ఫస్ట్ లెవెల్ చెకింగ్) బుధవారం ఈ.సి.ఐ.ఎల్ ఇంజనీర్లచే పూర్తిచేశామన్నారు. జుక్కల్‌కు 319, ఎల్లారెడ్డికి 338, కామారెడ్డికి 333 ఈవీఎం లను కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల పర్యవేక్షకులు ఉమలత, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సమయాన్ని గంట పెంచిన కేంద్ర ప్రభుత్వం..

ఈనెల 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెంచిందని ఆయన తెలిపారు.

పోలింగ్ సమయం పెంపు వల్ల ఉద్యోగులు, వ్యాపారస్తులు, కార్మికులు, ప్రజలు ఓటింగ్ ప్రక్రియలో అధిక సంఖ్యలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. పట్టణ ప్రాంతంలో తక్కువగా ఓటింగ్ నమోదు, ప్రస్తుత వేసవి, ఎండలు తదితర కారణాల వల్ల కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని సాధ్యమైనంత వరకు ఉదయం వెళ్లి ఓటింగ్ వేసేలా చూడాలని కోరారు. వంద శాతం ఓటింగ్ నమోదు కావాలని ఆదేశించారు.

ఎన్నికల అంశాలను పరిశీలకుల దృష్టికి తేవచ్చు

జహీరాబాద్ పార్లమెంటు 99 నియోజకవర్గం పరిధిలోని కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్ వాసులు ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి అంశాలైన సాధారణ పరిశీలకులకు దృష్టికి తేవచ్చని, ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి.తివారి ఐఏఎస్ ఈ నెల 4న కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఎన్నికలతో ముడిపడిన ఏ విషయమైనా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు పరిశీలకులను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని, సందేహాలు నివృత్తి చేసుకోవడంతో పాటు సలహాలు, సూచనలు అందించవచ్చని అన్నారు. నేరుగా కలవలేని వారు 7995692890 ఫోన్ నెంబరు ద్వారా సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

గ్రంథాలయానికి కూలర్లు వితరణ


అందజేసిన కూలర్లు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని గ్రంథాలయానికి రూ .7000 విలువగల రెండు కూలర్‌లను మండల కేంద్రానికి చెందిన కుందారపు శ్రీనివాస్ బుధవారం అందజేశారు. ప్రస్తుతం విద్యార్థులు, నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో వేసవిలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కూలర్లను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని ప్రచారం


ఆత్మీయ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలో పాస్టర్స్ అసోసియేషన్ సభ్యుల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కారు గుర్తుకే ఓటు వేసి బాజిరెడ్డి గోవర్దన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సభ్యులను కోరారు. కార్యక్రమంలో న్యాయవాది జి జి రామ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహతి ఆశ్రమానికి విరాళం



విరాళం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో పట్వారి గోపీకృష్ణ అధ్యక్షతన మహతీ ఆశ్రమంలో గురువారం అన్నదానాన్ని ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా గోపికృష్ణ సతీమణి భార్గవి విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ పట్వారి ప్రగతి నిరాశ్రయ విద్యార్థుల అవసర నిమిత్తం ఆశ్రమానికి 5000 రూపాయలు చెక్కుని అందజేశారు ఈ సందర్భంగా అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలకు సేవలు అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ రోటరీ మాజీ అధ్యక్షులు ప్రవీణ్ పవార్, ఆనంద్, అంకం దామోదర్, శాంతాబాయి, విద్య శ్రీ, ఆశ్రమ సిబ్బంది నరేష్, స్వరూప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ఏర్పాటు చేసిన్న రెడ్‌క్రాస్ సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వేసవి దృష్ట్యా చలి వేంద్రాలు బాటసారులకు ఎంతో ఉపయోగమని రెడ్ క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ఖలీల్‌వాడి లోగల రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఖలీల్ వాడి మొత్తం ఆసుపత్రులు ఉన్నాయి కనుక రోగుల బంధువులకు, బాటసారులకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, ప్రతి మండలంలో మండల రెడ్ క్రాస్ కార్యవర్గం ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపె రవీందర్, కార్యదర్శి అరుణ్ బాబు, ఈసీ మెంబెర్ సూర్య నారాయణ, వెంకట కృష్ణ అలాగే ఎంసి మెంబెర్స్ సోలొమన్, శ్రీనివాస్ రావు, హన్మంతు రావు, పిఆర్ఓ బొద్దుల రామకృష్ణ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మార్కులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత నెల 7న నిర్వహించిన మోడల్ స్కూల్స్ 5వ తరగతి ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థులు మార్క్స్ వెబ్సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు రాసిన విద్యార్థులు తమ హాల్ టికెట్ ద్వారా తమ మార్క్స్ తెలుసుకోవచ్చని అన్నారు. ఇది కేవలం మెరిట్ లిస్ట్ మాత్రమేనని వివరించారు. telanganams.cgg.gov.inలో చుసూకోగలరు. అలాగే రిజర్వేషన్, లోకల్ విద్యార్థుల సంఖ్యను బట్టి చివరి సెలక్షన్ లిస్టని త్వరలో విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు.

గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్


మోపాల్: మంచిప్పలో ఫ్లాగ్‌మార్చ్

నవతెలంగాణ-మోపాల్

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి గాను మరియు ప్రజలు వారి ఓటు హక్కు శాంతియుతంగా వినియోగించుకోవాలని మండలంలోని మంచిప్ప గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఇందులో సౌత్ సిఐ పి సురేష్, మోపాల్ ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ , సిఆర్పిఎఫ్ సిబ్బంది, ఏసీపి క్యూఆర్టి పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండల కేంద్రంలోని డిచ్ పల్లి రైల్వే స్టేషన్ నుంచి రాహదరి వెంట ఘన్‌పూర్ వరకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ను గురువారం నిర్వహించారు. ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో శాంతి యుతంగా ప్రజలు స్వేచ్ఛ గా పాల్గొనాలని డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లేష్ అన్నారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి, ఇందల్ వాయి ఎస్సై లు యమహేష్, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో ఫ్లాగ్‌మార్చ్

లోక్‌సభ పోరులో మాటల యుద్ధం

- జోరందుకున్న ప్రచారం
- ఓటర్ల మొగ్గు ఎవరికో?

నవతెలంగాణ-ఆర్మూర్


లోక్‌సభ ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్ది ప్రధాన మూడు పార్టీల అభ్యర్థుల మధ్య మాటల యుద్ధం జోరుగా కొనసాగుతుంది. బీఆర్ఎస్, బీజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్దన్, ధర్మపురి అరవింద్, జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారాల్లో భాగంగా విమర్శనస్త్రాలను గుప్పిస్తున్నారు. మూడు పార్టీలు హెూరాహెూరి తలపడుతున్నాయి. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి పూర్తి మెజారిటీ ఇవ్వలేదు. ఇక్కడ ఉన్న ఏడు సెగ్మెంట్లలో మూడింట బీఆర్ఎస్ గెలిస్తే, కాంగ్రెస్, బిజెపి రెండేసి చొప్పున పంచుకున్నాయి. ప్రతిసారి విలక్షణ తీర్పునిచ్చే జిల్లా ఓటర్లు ఈసారి ఎవరిని ఆదరిస్తారో.

త్రిముఖ సమరమే...

మూడు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులు అనేక ఎన్నికల్లో ఆరితేరిన ఉద్దండులే.. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న తాటిపర్తి జీవన్ రెడ్డి 5 సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసే ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతుండగా కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రచారం నిర్వహిస్తున్నారు. 40ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న బాజిరెడ్డి గోవర్దన్ పోలీస్ పటేల్ నుండి సర్పంచ్, ఆర్టీసీ చైర్మన్ వరకు పదవులను చేపట్టి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. రెండుసార్లు పిసిసి అధ్యక్షునిగా, మంత్రిగా పనిచేసిన డి శ్రీనివాస్ తనయుడు ధర్మపురి అరవింద్ సిట్టింగ్ ఎంపీ. వీరి మధ్య త్రిముఖ పోటీ నెలకొంది.

పార్లమెంట్ పరిధిలో బీడీ కార్మికులు, గల్ఫ్ కుటుంబీకులే కీలకం..

పార్లమెంట్ పరిధిలో రైతుల తర్వాత బీడీ కార్మికులు, గల్ఫ్ కుటుంబీకులే అన్ని సెగ్మెంట్లలో ఉన్నారు. సుమారుగా 5:30 లక్షల వరకు ఓటర్లు ఉండగా వీరు తీసుకునే నిర్ణయ మే ఎన్నికల్లో కీలకం కానుంది. అన్ని పార్టీలు వారిని ఆకర్షిం చేందుకు పావులు కదుపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గల్ఫ్ సంఘాలతో సమావేశం నిర్వహించి


జీవన్‌రెడ్డి



అర్వింద్


బాజిరెడ్డి గోవర్దన్

ఎన్నికల తర్వాత గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు, పునరావా సం కల్పిస్తామని, గల్ఫ్ లో చనిపోయిన కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా అందిస్తామని తెలుపగా, గత పది ఏళ్లలో తమ సర్కారు చేసిన సంక్షేమ కార్యక్రమాలే తమకు ఓట్లు కురిపిస్తాయని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. గత ఎన్నికల తరహాలోనే ఈసారి కూడా గల్ఫ్ బీడీ కార్మికుల మైనారిటీల మద్దతు తమకేనని బిజెపి అంచనా వేసుకుం టుంది. ప్రతి ఎన్నికల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఎజెండాగా మారుతుంది .సెప్టెంబర్ 17 నాటికి ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాంమని సీఎం రేవంత్ రెడ్డితో సహా నేతలు హామీలు ఇస్తున్నారు. కాగా రైతులను మోసం చేసేందుకే బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు ఈ ప్రకటనలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు..

విలక్షణ తీర్పునిస్తున్న రైతన్నలు

ప్రతి ఎన్నికల్లో రైతులు తీసుకునే నిర్ణయాలే అభ్య ర్థుల గెలుపు ఓటము లను నిర్ణయిస్తు న్నాయి.. గత ఎన్నికల సరళిని పరిశీలిస్తే జిల్లాలోని ఆర్మూర్ డివిజన్ కేంద్రంగా ఎర్రజొన్న రైతుల ఆందోళన తర్వాత ప్రత్యేక రాష్ట్రంలోని పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కవితను గెలిపించారు.. కాగా ఎంపీ హెూదాలో కవిత ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం పసుపు బోర్డు తీసుకురాక పోవడంతో రైతులే 2019లో పోటీగా నామినేషన్లు వేశారు. పార్లమెంట్ చరిత్రలోనే ఏకంగా 186 మంది పోటీ పడ్డారు. ఆ ఎన్నికలలో అధికార పార్టీ అభ్యర్థిగా ఉన్న కవితను ఓడించడంతో పాటు పసుపు బోర్డు తీసుకువస్తానన్న బిజెపి అభ్యర్థి ధర్మపురి అరవింద్‌కు పట్టం కట్టారు.. ఐదేళ్ల తర్వాత పసుపు బోర్డు ప్రకటించి జీవో జారీ చేసిన దానిని ఎక్కడ పెడతారో ఇంకా స్పష్టం చేయకపోవడంతో ఈసారి వారు తీసుకునే నిర్ణయమే కీలకంగా మారనుంది. జిల్లా పార్లమెంట్ పరిధిలో గ్రామీణ ప్రాంతాలే ఎక్కువగా ఉన్నవి.. అర్బన్, రూరల్ తర్వాత బోధన్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల జగిత్యాల అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలోని నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్, మెటపల్లి, కోరుట్ల, జగిత్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి. రైతులు, బీడీ కార్మికులు గల్ఫ్ కార్మికులు ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గం ప్రతిసారి విలక్షణ తీర్పునే ఇస్తుంది. ప్రధానంగా వరి, చెరుకు, పసుపు, మొక్కజొన్న, ఎర్ర జొన్నలు రైతులు పండిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో రైతులు తీసుకునే నిర్ణయాలే అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయిస్తున్నాయి. ఈసారి అభ్యర్థి విజయం ఎవరిని ఆదరిస్తుందోనని ఆసక్తి ప్రతి ఒక్కరిలో నెలకొంది.



గత ఎన్నికల తీరు ఇలా..

మొత్తం ఓటర్లు 17,01, 573 పురుషులు 8,04,568, మహిళలు 8,96,915 ఇతరు లు90 కాగా 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల కవితకు ఓట్లు 4,39,307, కాంగ్రెస్ నుండి మధు యాష్కికి 2,72,123ఓట్లు బిజెపి నుండి లక్ష్మీనారాయణకు 2,25,333 ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల్లో బిజెపి నుండి ధర్మపురి అరవింద్‌కు 4,80,584ఓట్లు, బీఆర్ఎస్ కల్వకుంట్ల కవితకు 4,09,709ఓట్లు, కాంగ్రెస్ నుండి మధు యాష్కికి 69,240ఓట్లు పోలయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్‌కు 4,17,315ఓట్లు కాంగ్రెస్‌కు 4,08,135ఓట్లు, బిజెపికి 3,65,374 ఓట్లు వచ్చాయి. ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరగగా 11 సార్లు కాంగ్రెస్, మూడు దఫాలుగా టిడిపి, ఒక్కోసారి బీఆర్ఎస్, బిజెపి స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా
వేతన ఒప్పందం అమలు చేయాలి

- తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు)

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

బీడీ కార్మికులందరికీ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో బీడీ కంపెనీ యజమానుల సంఘం అధ్యక్షుడు హెచ్‌పీ ప్రకాష్ ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్ గాంధీకి డిమాండ్ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టీ.యు) రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ.. 30 ఏప్రిల్ 2024 వరకు వేతన ఒప్పందం ముగిసిందన్నారు. వెంటనే వేతన ఒప్పందం చేసి 01 మే 2024 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు వేయి బీడీలకు 400 రూపాయలు ఇవ్వాలన్నారు. నెలసరి జీతాల ఉద్యోగులైన బీడీ ప్యాకర్లు, సార్టర్, ఆకు, తంబాకు పంచేవారు, గుమస్తాలకు, అకౌంటెంట్లకు, బట్టీవాల, చెన్నీవాల, గంపవాల, వాచ్ మెన్‌లకు ప్రస్తుత వేతనంపై 50శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కరువు భత్యం వీడీఏ రేటు పాయింట్‌కు పది పైసల నుండి 30 పైసలకు పెంచాలని డిమాండ్ చేశారు. డిడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు అనేక సమస్యలు ఉన్నాయని వాటన్నింటినీ సామరస్యంగా చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో ఆందోళనలకు పూనుకుంటామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రాజన్న, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకన్న, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రాంప్రసాద్ పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బ్యాలెట్ యూనిట్ల తరలింపు

- పర్యవేక్షించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కట్టుదిట్టమైన భద్రత నడుమ గురువారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుండి నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు తరలించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ తరలింపు ప్రక్రియ నిర్వహించారు. అంతకుముందు ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందంచే బ్యాలెట్ యూనిట్ల ప్రాథమిక పరిశీలన (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియ జరిపించారు. అనుబంధ ర్యాండమైజేషన్ చేపట్టి, ఆ జాబితాను అనుసరిస్తూ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లను తరలించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ఈసీ సూచనలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా తరలింపు జరిగేలా కలెక్టర్, అదనపు కలెక్టర్ పకడ్బందీ పర్యవేక్షణ జరిపారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ సాకేత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు ఉన్నారు.


బ్యాలెట్ యూనిట్లను తరలిస్తున్న అధికారులు

పెరిగిన పోలింగ్ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వేసవి తీవ్రత, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ తక్కువగా నమోదు కావడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని, వివిధ వర్గాల వారి అభ్యర్థన మేరకు ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఈ నెల 13న జరుగనున్న పోలింగ్ సందర్భంగా పెంచిన సమయం అందుబాటులో ఉంటుందని సూచించారు. వాస్తవానికి సాధారణ ఎన్నికల్లో పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉండగా, ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని భారత ఎన్నికల సంఘం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పెంచిందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సమయం పెంపు వల్ల ఉద్యోగులు, వ్యాపారస్తులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు ఓటింగ్ ప్రక్రియలో అధిక సంఖ్యలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకునేందుకు మరింత వెసులుబాటు లభించిందని అన్నారు. పెంచిన పోలింగ్ సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

కేజీబీవీ విద్యార్థినిని అభినందించిన డీఈవో


విద్యార్థినిని అభినందిస్తున్న డీఈవో

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కేజీబీవీ విద్యార్థిని ఎం సిరి పదవ తరగతి ఫలితాలలో 10/10 జిపిఏ సాధించింది ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, జిఈసిఓ వనిత విద్యార్థిని అభినందించినట్లు కేజీబీవీ ఇంచార్జి ప్రత్యేక అధికారిని కె.నవనీత గురువారం తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో 10 జిపిఏ తో పాటు, 9.7 జిపిఏ నలుగురికీ, 9.3 జిపిఏ ఐదుగురికి, 9.2 జీపీఏ నలుగురికీ, 9జీపీఏ ఇద్దరికి రాగా 39 మందికి గానూ 37 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులై 95శాతం ఉత్తీర్ణత సాధించారని ని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గిరిరాజ్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో 2,3 బహుమతి


సర్టిఫికెట్‌ను అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (ఎ) నిజామాబాద్‌కు చెందిన భౌతిక శాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్స్ విభాగనికి చెందిన జిగ్యాస స్టూడెంట్ స్టడి ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయిలో మూడవ బహుమతిని, రెండవ బహుమతిని బుధవారం కళాశాల విద్యాశాఖ కమిషనర్ బి.వెంకటెషం ఐఏఎస్ చేతుల మీదుగా సంస్కృతి, రాజ్ భవన్ కమ్యూనిటిహాల్, హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను అందుకున్నట్టు గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాం మోహన్ రెడ్డి తెలిపారు. బహుమతిని అందుకున్నవారిలో భౌతిక శాస్త్ర విభాగం ప్రాజెక్టు పర్యవేక్షకులు అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజిక్ వజీరా భాను, కంప్యూటర్ సైన్స్ ప్రాజెక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ గౌడ్, విద్యార్థిని విద్యార్థులు ఈ ప్రాజెక్టు లో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి రెండవ బహుమతికి రూ.21వేల నగదు బహుమతి, సర్టిఫికెట్, మూడవ బహుమతికి రూ.12వేల నగదు బహుమతి, సర్టిఫికెట్ ప్రాజెక్టు పర్యవేక్షకులు, విద్యార్థులకు అందజేశారని అన్నారు. ఈ ప్రాజెక్టు లను విజయవంతం చేసి రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులను పర్యవేక్షకులను కళాశాల అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఉస్మానియా యూనివర్సిటీపై వస్తున్న వదంతులు నమ్మవద్దు

- ఎన్ఎస్‌యుఐ



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉస్మానియా యూనివర్సిటీపై గత కొన్ని రోజులుగా వస్తున్న వదంతులను నమ్మొద్దని తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షులు సాగర్ నాయక్ అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుందన్నారు. ఎప్పటిలాగా వేసవి సెలవుల్లో భాగంగా సెలవులు ఇచ్చినట్టు ఈ ఏడాది సైతం ఇచ్చారని, కానీ విద్యార్థుల కోరిక మేరకు పోటీ పరీక్షల నేపథ్యంలో సమ్మర్ వెకేషన్ హాలీడేస్‌లో హాస్టల్ ఓపెన్ చేసి మెస్ కూడా ఓపెన్ చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా యూనివర్సిటీలో ఎలాంటి తాగునీరు, కరెంట్ సమస్య లేదని, ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యాశాఖ వారితో చర్చించకుండా సర్క్యులర్ రిలీజ్ చేసినందుకు చీఫ్ వార్డెన్‌కు షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు వివరించారు. ఉస్మానియ యూనివర్సిటీలో హాస్టల్, మెస్ తెరవడం కోసం సర్క్యులర్ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ ఎస్ యు ఐ నాయకులు సందీప్, లింగస్వామి, చందర్, సంజయ్,వినోద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వరంపల్లి గ్రామంలో మాజీ వార్డ్ మెంబర్ బలరాం భార్య బాలమణి ఐదురోజుల క్రితం మరణించారు. విషయం తెలుసుకున్న గ్రామ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజు, గ్రామస్తులు అనిల్, రాజు, రామాంజనేయులు, ప్రవీణ్, ప్రమోద్, సురేష్, స్వామి తదితరులున్నారు.



కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న చంద్రకాంత్‌రెడ్డి

తాగునీటి సమస్యలకు తక్షణమే పరిష్కారం

- పంచాయతీ సెక్రెటరీ సాయిలు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని ఎస్ఎన్‌పురం గ్రామంలో గల పలు కాలనీల్లో ప్రజలకు తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్న పంచాయతీ సెక్రటరీ సాయిలు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున నీటి ఇబ్బందులు లేకుండా పైపులైన్ వేసి వాటర్ ట్యాంక్ ద్వారా నీరు వచ్చేలా మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు.



మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలో ఎస్ఎన్‌పురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ సర్పంచ్ నెమని నాగమణి విరాజ్ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ, అరటి పండ్లను పంపిణీ చేశారు. అనంతరం కూలీలతో పిసిసి డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి, ఎంపీపీ మేక లక్ష్మీ వీర్రాజు మాట్లాడుతూ.. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్‌కు చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఉచిత బస్సు ఫ్రీ, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, రూ.500కే సిలిండర్ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత ఇందిరమ్మ ఇండ్లు, రెండు లక్షల రుణమాఫీ, 2500 రూపాయలు మహిళలకు నెలకు ఇస్తుందని తెలిపారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రతి నిరుపేద కుటుంబానికి సంవత్సరానికి లక్ష రూపాయలు ఖాతాలో జమ చేస్తుందని, ఇలా అన్ని పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీని ఆదరించి చేతి గుర్తుకు ఓటు వేయాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉందని దీనికి తోడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు మోయిన్, డిసిసి డెలిగేట్ గంగాప్రసాద్, రాష్ట్ర మైనార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ భారీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హర్ష, ఉపాధ్యక్షుడు శ్రీను, దామినేని నాగేశ్వరరావు, ముత్యాల కృష్ణ, ప్రశాంత్, గుణ్ణం వెంకటేశ్వరరావు, బొజ్జ శ్రీను, నాగరాజు, వంక శ్రీను, చారి, గజ్జల సాయిలు, నర్సింలు, భీష్మ, నేమాని రఘు, ముక్తార్, ఆవేశ్, నిఖిల్, శంకర్, బాలరాజ్, నవీన్, సాయి, వెంకటేష్, సతీష్, అరుణ్ రెడ్డి, జలీల్, అత్తర్, రాజు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, రైతు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

- ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేష్

నవతెలంగాణ-రామారెడ్డి

కార్మిక, రైతు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ పిలుపునిచ్చారు. గురువారం 138వ మేడే వార్షికోత్సవంలో భాగంగా మండలంలోని అన్నారంలో ఐఎఫ్‌టీయూ జెండాను ఆవిష్కరించి మేడే వార్షికోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలు, నాలుగు లేబర్ కోడ్లను మార్చేసి మిగతా 15 చట్టాలను అడ్రస్ లేకుండా చేసి, నాలుగు లేబర్ కోడ్లను కార్మిక సమ్మెపై అనేక ఆంక్షలు విధిస్తున్నారని మండిపడ్డారు. రైతు నల్ల చట్టాలు తీసుకొచ్చి, రైతును భూమి నుంచి వెళ్ళగొట్టే కుట్ర జరుగుతుందని అన్నారు.



మేడే వార్షికోత్సవంలో పాల్గొన్న నాయకులు

కార్యక్రమంలో రాజన్న, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు జి.సురేష్, ఆర్.దామోదర్, కే గోపాల్, ఆర్.వెంకటి, చంద్ర, జై.శశికళ, డి.కల్పన, కె.నరసవ్వ, ఎండి.సయ్యద్, అనీఫ్, ఎర్రన్న, బాల్‌రెడ్డి తదితరులున్నారు.

సురేష్ షెట్కర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కార్యకర్తలను సూచించారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలో తన నివాసం వద్ద నియోజకవర్గ అన్ని మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన సురేష్ షెట్కర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వారి వారి బూతులలో కష్టపడి కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ తీసుకురావాలని ముఖ్య నాయకులకు ఆయన సూచించారు. జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామన్నారు. ప్రతి కర్యకర్త కష్టపడి పని చేయాలని, కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని ఆయన ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత, గొంతుకు ఆపరేషన్ జరిగిన తర్వాత మొదటిసారి నియోజకవర్గానికి విచ్చేసిన వడ్డేపల్లి సుభాష్ రెడ్డికి కార్యకర్తలు పరామర్శించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షల తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్ద లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రబాబు, నల్లమడుగు షరీఫ్, రైలు దేవేందర్, అన్ని మండలాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

కాంగ్రెస్ పథకాలు ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు మహమ్మద్ ఇలియాస్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టో, ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతితో పాటు గ్రామ సమస్యల గురించి చర్చించారు. కాంగ్రెస్ చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని, ప్రతిపక్షాల కుట్రలను సామాజిక మాధ్యమాల్లో ఎలా తిప్పి కొట్టాలో యువజన నాయకులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ యువజన అధ్యక్షులు వంశీ, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ సాయి, మణికంఠ, మనీష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జంగంపల్లి మాజీ సర్పంచ్ నరసింహులు యాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నరేష్ తెలిపారు. గురువారం జంగంపల్లి గ్రామంలోని కుల సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని, దీనికోసం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకాలు, మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని సూచించారు. కుల సంఘాల సమస్యలను అధిష్టానానికి వివరించి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా కుల సంఘాల సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి గెలవాలని పోచమ్మ ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్ భారీ మెజార్టీతో విజయం సాధించాలని కాంగ్రెస్ మండల నాయకులు నల్ల పోచమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధరగౌడ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ బోయిని విఠల్, కోఆప్షన్ సభ్యుడు షాహిద్ పా, హనుమాన్లు, ఇమామ్, గులాం హుసేన్, గోపాల్‌పేట్ గ్రామ అధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమన్యాయం కావాలంటే..

కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మొబిన్‌ఖాన్ స్పష్టీకరణ

నవతెలంగాణ-రెంజల్

భారత దేశంలో బడుగు బలహీన వర్గాల సమన్యాయం కావాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని దూపల్లి, దండిగుట్ట గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 6 గ్యారంటీ పథకాలతో ప్రజలకు మరింత చేరువలోకి తీసుకువస్తుందని ఆయన అన్నారు. నేడు ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆయన విమర్శించారు. బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు పెద్దపీటవేస్తూ బడుగు బలహీన వర్గాలకు అణగదొక్కే ప్రయత్నం చేస్తుందని ఆయన అన్నారు. రాబోవు కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ కూలీలకు రోజుకి రూ.400 వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే తూచా తప్పకుండా ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీ పథకాలను అమలు పరిచే విధంగా ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధనుంజయ్, నాగభూషణం రెడ్డి, జి.సాయిరెడ్డి, సురేందర్‌గౌడ్, జావీద్ ఉద్దీన్, సిహెచ్.రాములు, మోహన్, సాయిబాబాగౌడ్, ఓ.మోహన్, వేణు, సగ్గు వెంకటి, కొజ్జా భూమన్న, శంషొద్దీన్, సిద్ద సాయిలు, గైనిక్ కిరణ్, ఎల్.కృష్ణ, గంగాధర్, సురేష్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-బోధన్

మరో 10 రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ, ఉపాధిహామీ కూలీలు పనిచేస్తున్న వద్దకు చేరి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. గురువారం సాలూర మండలంలోని తగ్గెల్లి, ఫతేపూర్ గ్రామాలలో, బోధన్ మండలం అమ్దాపూర్, ఊట్పల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అల్లె రమేష్, గంగాశంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు నిరుపేదల సంక్షేమానికి నిదర్శనమని కావున ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కోరారు. గ్రామాలలో అభివృద్ధి పనులు జరగాలన్న, నిరుపేదల సంక్షేమం జరగాలన్న కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఈ ప్రచారంలో మందర్నా రవి, లక్ష్మణ్, సీనియర్ నాయకులు టప్పా సాయిలు, డీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్ర పల్లన్న, కారేగాం అశోక్ రెడ్డి, బల్లెపు నర్సయ్య, ఖాదర్ పాషా, నరేందర్ గౌడ్, జాయ రాజు, పెద్ద సాయన్న, ఇస్మాయిల్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సూపరింటెండెంట్ ఇంజనీర్

నవతెలంగాణ-భిక్కనూర్

విద్యుత్ సిబ్బంది అప్రమత్తండా ఉండాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమేష్ బాబు అన్నారు. గురువారం మండలంలోని జంగంపల్లి, బస్వాపూర్, భిక్కనూర్ 33/11 కెవి సబ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం వ్యవసాయ విద్యుత్ సరఫరా చేసే ఫీడర్ల పైన అంతరాయాలు ఎలా ఉన్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నిత్యం విద్యుత్ లైన్లు తనిఖీ చేస్తూ అంతరాయం లేకుండా విద్యుత్ వినియోగదారులకు అందించాలని, ఎలాంటి సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బస్వాపూర్ గ్రామంలో విద్యుత్ అంతరాయం తగ్గించడానికి నూతనంగా ఏర్పాటు చేసిన 11 కె.వి సబ్ స్టేషన్ ఫీడర్‌ను పరిశీలించారు. విద్యుత్ సిబ్బంది స్థానికంగా ఉండి ప్రజలకు అంతరాయంలేని విద్యుత్‌ను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్, భిక్కనూర్ ఏఈ రామలక్ష్మి, సబ్ ఇంజనీర్ శివతేజ, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ ఇంజనీర్

మెజీషియన్ పెండ్లి రోజు వృద్ధాశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-కామారెడ్డి

మెజీషియన్ సంతోష్ భవానీ దంపతుల పెండ్లిరోజును పురస్కరించుకొని గురువారం కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లిలో గల వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెజీషియన్ సంతోష్ మాట్లాడుతూ.. ఎవరు లేని వృద్ధులు, అనాథల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో గల 35 మంది వృద్ధులకు అన్నదానం చేశానని తెలిపారు.



వృద్ధులకు అన్నం పెడుతున్న సంతోష్

ఉపాధి కూలీల వద్ద ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న జాజాల సురేందర్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డి, గొల్లపల్లి, మోషన్‌పూర్, రాజమ్మ తండాలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ పార్టీ తరపున ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పది సంవత్సరాలు రైతులకు, ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచిపోయిన బీఆర్ఎస్ పార్టీ కారుగుర్తుకు ఓటు వేసి, జహీరాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించి తెలంగాణ అభివృద్ధిని మరింత సాధించుకుందామని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి, మండలాధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, నాయకులు నారాయణరెడ్డి, భానూరి నర్సారెడ్డి, పాల మల్లేష్, రాజేందర్‌గౌడ్, కడెం శ్రీకాంత్, పడిగల శ్రీనివాస్, జంగం లింగం, సంకిలింగం, రెడ్డి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు తథ్యం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంతరెడ్డి, జడ్పీటీసీ తిర్మాల్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని ప్రజలకు వివరించారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని, హామీలను ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ సెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి పది సంవత్సరాలుగా బిబి పాటిల్ అభివృద్ధి శూన్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, కార్యదర్శి శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, మహిళా జిల్లా నాయకురాలు కవిత, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రావులపల్లి నర్సారెడ్డి, నల్లపు శ్రీనివాస్, ఎంపీటీసీ శంకర్, కోఆప్షన్ సభ్యుడు శమీ గోపాల్‌రెడ్డి, నాగారపు రాములు, పులవైన రమేష్, అబ్రబోయిన రాజేందర్, అబ్రబోయిన రాజు, సంజీవరెడ్డి, కుమ్మరిరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి దేశాన్ని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని, చేతి గుర్తుకు ఓటు వేసి, కాంగ్రెస్‌ను గెలిపిద్దామని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నామాల రవీందర్, ఎం.గోపి, జగన్, చాత్రబోయిన బాలయ్య, ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన గాంధారి జడ్పీటీసీ

నవతెలంగాణ-గాంధారి

జెడ్పిటిసి సభ్యుడు శంకర్ నాయక్ బిఆర్ఎస్‌ను వీడి ఆయన అనుచరులతో కలిసి గురువారం ఎమ్మెల్యే మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వెంట సుమారు 500ల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్టు మొత్తిరం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన పలువురు

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గాంధారి మండలాధ్యక్షుడు మోహన్ నాయక్ మాట్లాడుతూ.. ఎంఎల్ఏ మదన్ మోహన్ అడుగుజాడల్లో నడుస్తూ పార్లమెంట్ ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేసి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయ్యడమే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే తన లక్ష్యమని అన్నారు.

ఓటు ప్రాధాన్యతపై సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు



నవతెలంగాణ-ఆర్మూర్

పార్లమెంట్ ఎలక్షన్ -2024 స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం మునిసిపల్ పరిధిలో ఓటు ఆవశ్యకతను తెలిపేలా గురువారం పలు జనసమర్ధ ప్రదేశాలలో సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్, కమిషనర్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా తమ ఓటు వినియోగించుకోవాలని, ఓటు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ భూమేశ్వర్ ఏఈ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఈఈ పూర్ణ మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు : డిఐఈఓ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించే గడువు మే 4 వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఇంటర్ విద్యా అధికారి టి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను గత మార్చి నిర్వహించిన వార్షిక పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థులకు మరో రెండు రోజులు ఫీజు గడువును ఇంటర్ బోర్డు పొడిగించిందని నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యఅధికారి టి.రవికుమార్ తెలిపారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్ళు, ప్రైవేటు కళాశాలలు, గురుకులాల కళాశాల ప్రిన్సిపాళ్లు ఈ విషయాన్ని గమనించి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఫీజులు చెల్లించడానికి కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని మరో రెండు రోజులు ఉపయోగించుకోవచ్చని జిల్లా ఇంటర్ విద్య అధికారి తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ పద్మశాలి సంఘం 'రెండో పంథా' ఆధ్వర్యంలో శుక్రవారం గుడి (అమ్మవారి ఆలయం)నిర్మాణానికి రూ.21 వేల రూపాయలను విరాళంగా ఆలయ కమిటీ నిర్మాణ బాధ్యులకు గురువారం రోజు ఉదయం పద్మశాలి సంఘ పెద్దలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎర్రోళ్ల విజయ్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. విరాళం అందజేసిన పద్మశాలి సంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం పెద్దలు పెంటు గంగాధర్, బ్రమ్మదండి చిన్నయ్య, జోగు నర్సయ్య, మూర్తి, జోగు నరేందర్, టెంటు శ్రీనివాస్, జోగు అనిల్, కృష్ణహరి, పోస్టు నర్సయ్య దాసరి నరేష్ తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్వోకు చిరు సన్మానం

సత్కారం పొందుతున్న ఎస్వో వినోద



ఎస్వోను సన్మానించి అభినందిస్తున్న డీఈవో

నవతెలంగాణ-ముప్కాల్

2023-24 పదవ తరగతి ఫలితాల్లో ముప్కాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ పాఠశాల) వంద శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా గురువారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గ ప్రసాద్, జీఈసీవో వనిత చేతుల మీదుగా సన్మానం పొందినట్లు పాఠశాల ఎస్వో ఆర్.వినోద తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల విద్యార్థులకు వారితో పాటు పాఠశాల అధ్యాపక బృందంకు సైతం డీఈవో దుర్గాప్రసాద్ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జీఈసీవో వనిత, పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు

గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన యూనివర్సిటీ నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న టీయూ విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై, వేసవి కాలంలో వసతి గృహాలను, మెస్‌లను తెరిపించాలని, గ్రంథాలయంలో ఆన్లైన్ పరీక్షల సన్నదత కోసం కంప్యూటర్ సౌకర్యాలను కల్పించాలని, నూతన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కోరుతూ యూనివర్సిటీ విద్యార్థులు గురువారం తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ సమస్యలను యూనివర్సిటీ రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ గిరిజన శక్తి విద్యార్థి అధ్యక్షులు శ్రీను రాథోడ్, సాగర్ నాయక్, రాజు, కార్తీక్, శ్రీహరి, నవీన్ కుమార్, చందర్ రాథోడ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో మెళకువలు నేర్చుకోవాలి

- పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రోటరీ మాజీ అధ్యక్షులు సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

చదువుతోపాటు క్రీడలలో మెలకువలు నేర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర పీఆర్టీయూ ఉపాధ్యక్షులు, రోటరీ మాజీ అధ్యక్షులు మంచిర్యాల సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని మగ్గిడి గ్రామ పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మధు తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు

లోలెవెల్ బ్రిడ్జిలకు మోక్షమెప్పుడో?

- వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు
- గ్రామాలకు స్తంభిస్తున్న రాకపోకలు
- పట్టించుకోని పాలకులు

నవతెలంగాణ-సిరికొండ

లో లెవెల్ బ్రిడ్జిలతో వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్న మండల ప్రజలు సిరికొండ మండలంలో లోలెవెల్ బ్రిడ్జిల సమస్య తీరేది ఎప్పుడు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని న్యావనంది, రావుట్ల, నర్సింగ్ పల్లి, సిరికొండ, కొండూర్, గ్రామాల ప్రజలు లో లెవెల్ బ్రిడ్జిల వల్ల వర్షాకాలం వచ్చిందంటే చాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు మారిన నాయకులు మారిన లోలెవెల్ బ్రిడ్జిల వల్ల ఇబ్బందులు తప్పడం లేదని వివిధ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు వాగుల గుండా ప్రవహించే నీటి ఉధృతికి రెండు మూడు రోజుల పాటు ప్రవహించడంతో గ్రామాలకు రాకపోకలు ఆగిపోయి జనజీవనం స్పందించి పోతున్నది. నిజామాబాద్, భీంగల్ నుండి కామారెడ్డి వెళ్లే వారికి రాకపోకలు నిలిచిపోయి నిత్యవసర వస్తువులు లభించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిరికొండ మండల కేంద్రంలో గల దొడ్డ వాగుపై లోలెవెల్ బ్రిడ్జి ఉన్నందున శ్మశాన వాటికలో నుండి నీరు ప్రవహించడంతో శ్మశాన వాటికలో అంతక్రియలు చేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నామని ఇక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో హైలెవెల్ బ్రిడ్జిలను నిర్మించి ప్రజల కష్టాలను తీర్చాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని స్థానిక ప్రజలు కోరుతున్నారు



లోలెవల్ బ్రిడ్జిలు

భీంగల్ నుండి కామారెడ్డి వెళ్లే దారిలో లోలెవెల్ బ్రిడ్జిలు

వానాకాలం వచ్చిందంటే చాలు ప్రయాణికులకు ఏళ్ల నుంచి లోలెవెల్ బ్రిడ్జిలతో తిప్పలు తప్పడంలేదు. సిరికొడ నుండి నిజామాబాద్ వెళ్లే దారిలో కొండూర్‌వద్ద కప్పల వాగు, భీంగల్‌నుండి కామారెడ్డి వెళ్లే దారిలో మండలకేంద్రంలో దోండ్లవాగువద్ద లోలెవల్ బ్రిడ్జిలు ఉన్నాయి. మండలంలోని చిన్నవాల్గోట్, న్యావనంది, పెద్దవాల్గోట్, నర్సింగ్ పల్లి, రావుట్ల వద్ద లోలెవల్ బ్రిడ్జిలు ఉండటంతో వానాకాలంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పాలకులు మారిన లోలెవల్ బ్రిడ్జిలను హై లెవల్ బ్రిడ్జిలుగా నిర్మాణం చేసేందుకు ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వానాకాలంలో రాకపోకలకు అంతరాయం



లో లెవల్ బ్రిడ్జిలు ఉండటంతో వానాకాలంలో వరద ఉధృతి కారణంగా ఒకటి లేదా రెండు రోజుల పాటు ఇటు నిజామాబాద్, అటు కామారెడ్డి జిల్లాల ప్రయాణికులకు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మరికొన్ని లోలెవల్ బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాలకులకు, ఆఫీసర్లకు సమస్య తీర్చాలని విన్నవించిన పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఆఫిసర్లు స్పందించి ఈ వానాకాలంలో లోలెవల్ బ్రిడ్జిల స్థానంలో హై లెవల్ బ్రిడ్జిలు నిర్మించి ప్రయాణికుల ఇక్కట్లు తీర్చాలి.

ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిప్పర సంజీవ్

200 టేకు దుంగల పట్టివేత

- పొదల్లో దాచిన దుంగలు స్వాధీనం
- ప్రజలు అటవీశాఖ సిబ్బందికి సహకరించాలి
- రేంజ్ అధికారి రవీందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కొనసముందర్ గ్రామంలో గురువారం ముందస్తు సమాచారం మేరకు రేంజ్ సిబ్బందితో కలిసి దాడులు చేసి పెద్ద ఎత్తున టేకు కలప దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ అధికారి రవీందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తుగా అందిన సమాచారం మేరకు స్థానిక కార్పెంటర్ షాప్ ఏరియాలో పొదల్లో రైడ్ చేసి దాచిఉంచిన సుమారు 100 నుంచి 150 వరకు టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు. ఈ టేకు దుంగలను ఎవరు తీసుకొచ్చారు అనే విషయమై విచారణ జరుగుతున్నట్లు వెల్లడించారు. టేకు దుంగలు తీసుకొచ్చిన వ్యక్తులను గుర్తించి చట్టప్రకారం చర్యలు చేపడతామన్నారు. టేకు దుంగలు దాచి ఉంచిన ప్రదేశానికి చుట్టుపక్కల అనుమానాస్పదంగా ఉన్న కార్పెంటర్ షాపుల వారిపై కేసులు నమోదు చేసి, మెషిన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న టేకు దుంగలను, కార్పెంటర్ షాప్‌లో ఉన్న మెషిన్లను కమ్మర్‌పల్లి అడవి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. టేకు కలప దుంగల విలువ తమ అంచనా ప్రకారం రూ.లక్ష 50 వేల నుండి రూ.2లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న దుంగలను కొలతలు చేసి పూర్తి విలువపై అధికారులకు నివేదిస్తామన్నారు. దాచి ఉంచిన టేకు దుంగలను ఎక్కడెక్కడ కట్ చేసి తీసుకువచ్చారో పట్టా భూమి, అటవీశాఖ భూమి అనేది విచారణలో తేల్చి ఆ వ్యక్తులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు. అడవి సంపదను కాపాడడంలో ప్రజల అటవీ శాఖ సిబ్బందికి సహకారం అందించాలని ఆయన కోరారు. అడవి సంపదను దోచుకునే స్మగ్లర్లు, దొంగ చాటుగా టేకు కల్ప నిల్వ ఉంచుకునే కార్పెంటర్ షాపుల వివరాలు ఉంటే ప్రజలు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన కోరారు.



టేకుదుంగలు పట్టుకున్న ఫారెస్టు అధికారులు

జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

- ఎన్నికల ప్రచారంలో అన్వేష్ రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామంలో గురువారం తెలంగాణ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కిసాన్ ఖేత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ పనితీరును వివరించారు. పదేళ్ల కాలం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని తెలిపారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ కేంద్రంలో మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ దేశ ప్రజలను మభ్యపెడు తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసిందని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించే విధంగా కృషి చేస్తున్నా మన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక లోటును పూడుస్తూ క్రమశిక్షణతో వ్యవహరి స్తున్నట్లు గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తూ రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15లోపు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఇదివరకే ప్రకటించారని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యంరెడ్డి, కిసాన్ ఖేత్ అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, సీనియర్ నాయకులు బుల్లెట్ రాంరెడ్డి, డీసీసీ డెలిగేట్ ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, గ్రామ అధ్యక్షులు చిన్న రాజన్న, ఆకుల రమేష్, ప్రదీప్, గంగసాగర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడొద్దు : ఎస్ఈ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వేసవిలో విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.రవీందర్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ పట్టణంలోని ఆర్యనగర్ 33/11 కేవీ, మాదవ్ నగర్‌లో 11కెవి ఫీడర్‌ను నోడల్ ఆఫీసర్ బి.అశోక్, సిజిఎం (పీఎమ్ఎమ్) టిస్ఎన్‌పిడిసిఎల్ వరంగల్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులకు నిరంతర విద్యుత్ కోసం చేసిన పనులపై ఆరా తీశారు. నిజామాబాద్ పట్టణ పరిధిలో ఉన్న గృహ, వాణిజ్య, ఇతర వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా, ఓవర్ లోడ్ సమస్యలను అరాతీశారు, లోడ్ ఎక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై అదనంగా 160కేవీఏ-15, 100కేవీఏ-11, 63కేవీఏ-50 అమర్చి వినియోగదారులకు ఓవర్ లోడ్ సమస్యను తీర్చామని అన్నారు. పట్టణంలో అదనంగా 47 ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చనున్నట్లు తెలిపారు. అలాగే 33/11 కేవీ వినాయక్ నగర్ సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు అతి త్వరలో అమర్చుతామని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని ముప్కాల్ సెక్షన్ లోనీ వినియోగదారులకు లో వోల్టేజ్ ప్రాబ్లం రాకుండా ఉండడం కోసం కొత్తగా 33/11 కేవీ నల్లూరు సబ్ స్టేషన్ 2 కోట్ల రూపాయలతో ముప్కాల్ సెక్షన్లో 2023లో ప్రారంభం చేశారన్నారు. ఇందల్వాయి సెక్షన్‌లో వినియోగదారులకు నూతనంగా చంద్రాయన్‌పల్లిలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యి త్వరలోనే సబ్ స్టేషన్ ప్రారంభం కాబోతోందని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని వినియోగదారులకు లోవోల్టేజ్ ప్రాబ్లం రాకుండా నిరంతర విద్యుత్ అందజేయాలని సబ్ స్టేషన్లలో వ్యవసాయ వినియోగదారులకు అదనపు బ్రేకర్, లైన్లో కంట్రోల్, ఏబి స్విచ్ లు ఏర్పాటు చేయాలని వాటి వల్ల లైన్లో ఏమైనా బ్రేక్ డౌన్ జరిగినప్పుడు త్వరగా గుర్తించడమే కాకుండా వినియోగదారులకు తక్కువ సమయంలో విద్యుత్‌ను పునరుద్ధరించవచ్చని తెలిపారు. విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి వినియోగదారులకు నిరంతర సేవలు అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాల అంతరాయం రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో నిజామాబాద్ డివిజనల్ ఇంజనీర్ ఎమ్. శ్రీనివాస్, టౌన్ -1 ఏడిఈ ఆర్. చంద్ర శేఖర్, టౌన్ -2 ఏడిఈ తోట రాజశేఖర్, టౌన్ -3 ఏడిఈ పి. వీరేశం, ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలిగితే ఈ ఫోన్ నెంబర్ నిజామాబాద్ పట్టణం డి-1 8500399877, డి-2 8462222402, డి-3 9493546509, డి-4 - 9491074572, డి-5 9491075409, డి-6 9491075408, బోర్గం (పి) - 9493546522, నగరం-8500399877, సుభాష్ నగర్ 7382742124 లకు సంప్రదించాలని అన్నారు.

డిగ్రీ బ్యాక్‌లాగ్ ఫీజు చెల్లింపునకు 7 వరకు గడువు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ వర్సిటీ పరిధిలోని బిఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ 2019 నుండి 2023 బ్యాచ్‌కు చెందిన వారికి మాత్రమే మే, జూన్ -2024లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష ఫీజు తేదీ అపరాధ రుసుం లేకుండా 07 మే వరకు,100 రూ అపరాధ రుసుముతో 08 మే వరకు చెల్లించవచ్చునని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణ వివరించారు. పూర్తి వివరాలుతెలంగాణ వర్సిటీ వెబ్ సైట్ లో పొందుపరచడం జరిగిందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని గుడితండాలో గురువారం సూర్య ఆరోగ్యసంస్థ ఆధ్వర్యంలో ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 96 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా. అలేఖ్య , డా. సంతోష్ కుమార్, డా. నజీమ్ అహ్మద్ ఖాన్ , ఆప్తాలమిక్ శ్రీకాంత్ ,సూర్య ఆరోగ్య సంస్థ ప్రతినిధులు ప్రశాంత్, వినోద్, భూలక్ష్మి (ఏచ్ఈఓ) ఎఎన్ఎంలు, ఆశసిబ్బంది , పంచాయతీ సెక్రెటరీ మృదుల పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

పెర్కిట్ బస్టాండులో కంట్రోలర్ కరువు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బస్టాండ్‌లో కంట్రోలర్ లేకపోవడం వలన ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కంట్రోలర్ లేక ఎప్పుడూ ఏ బస్సు వస్తుందో తెలియక ప్రయాణికులు అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఆటోలు బస్టాండ్ లోపలికి వచ్చి ప్రయాణికులను తీసుకెళు న్నారు. కంట్రోలర్ లేక ప్రయాణికులకు బస్టాండ్ పరిపాలన నిర్వహణ గాడి తప్పి అస్తవ్యస్తంగా మారింది. దొంగ ఎవరో దొర ఎవరో తెలియకుండా ఆర్టీసి అధికారులు బస్టాండ్‌ను గాలికి వదిలేసి చోద్యం చూస్తున్నారని, ప్రయాణికులు తీవ్ర నిరసన తెలియజేస్తున్నారు. బస్టాండ్ ను కంట్రోల్ చేయడానికి వెంటనే కంట్రోలర్‌ను నియమించాలని, ఎండలు తీవ్రమైతున్న ఈ సందర్భంగా చలివేంద్రాన్ని కూడా ఏర్పాటుచేయలేక ప్రజల దాహార్తిని తీర్చలేక అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న ఆర్టీసి అధికారులపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కంట్రోలర్‌ను నియమించి ప్రజలకు అందుబాటులో ప్రయాణ వసతులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిపో మేనేజర్‌ను కోరుతున్నారు.



బాధిత కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందజేత


చెక్కు అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి

మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో గల తానాకలాన్ గ్రామంలో గల సహకార సంఘంలో పాల లక్ష్మి మెంబర్‌గా ఉన్నారు. ఆమె అనారోగ్యంతో మృతి చెందారు. దాంతో బాధిత కుటుంబానికి జెపిఎఇన్ (ఫ్రెండ్స్) సుమారు రూ.లక్ష మంజూరయ్యాయి. మంజూరైన లక్ష రూపాయల చెక్కును ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సహకార సంఘం అధ్యక్షులు పోల మల్యారెడ్డి మృతిచెందిన పాలలక్ష్మి భర్త గణపతి రెడ్డికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రాజారాం, డైరెక్టర్లు చేపూర్ నగేష్ గౌడ్, మొద్దోల్ల సురేష్, రాములు నాయక్, లక్ష్మి తదితరులున్నారు.

చెరువులో పడి మహిళ మృతి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని అమీనాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి మానసిక స్థితి బాగా లేక కాడి చెరువులో పడి మరణించినట్టు ఎస్సై వినయ్ గురువారం తెలిపారు .. గత 30 సంవత్సరాల క్రితం పడగల్ గ్రామానికి చెందిన అశోక్‌తో వివాహంకాగా విడాకులు తీసుకొని పుట్టింట్లో ఉంటుంది.. విడాకులు తీసుకున్నప్పటి నుండి మానసిక వ్యాధితో భాదపడుతున్నది. తరచూ ఇంటి నుండి వెళ్లి రెండు మూడు రోజులకొకసారి ఇంటికి వచ్చేది. 26. తేదీ ఇంటి నుండి వెళ్లి మళ్ళీ ఇంటికి రాలేదు.. మానసిక స్థితి బాగా లేక కాడి చెరువు లో పడి చనిపోయినదని ఆమే తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నాలుగు రోజులపాటు హెూమ్ ఓటింగ్

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఈ నెల 3, 4, 5, 6 తేదీల్లో హెూమ్ ఓటింగ్ నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. పార్లమెంటు సెగ్మెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1758 మంది ఓట్ ఫ్రమ్ హెూమ్ సదుపాయాన్ని వినియోగించుకోనున్నారని వివరించారు. వీరిలో 85 సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 859 మంది ఉండగా, దింవ్యాంగ ఓటర్లు 899 మంది ఉన్నారని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే, ఆర్మూర్ అసెంబ్లీ సెగ్మెంట్లో 181 మంది సీనియర్ సిటిజన్ ఓటర్లు, 209 మంది దివ్యాంగ ఓటర్లు తమతమ ఇళ్ల వద్ద నుండే ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. అలాగే, బోధన్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 123 మంది, దివ్యాంగ ఓటర్లు 111 మంది, నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 33 మంది, దివ్యాంగ ఓటర్లు 26 మంది, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 109 మంది, దివ్యంగ ఓటర్లు 183 మంది, బాల్కొండ నియోజకవర్గం పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 97 మంది, దివ్యంగ ఓటర్లు 96 మంది, కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 84 మంది, దివ్యంగ ఓటర్లు 132 మంది, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 232 మంది, దివ్యంగ ఓటర్లు 142 మంది ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వివరించారు. ఈ మేరకు ప్రత్యేకంగా 50 హెూమ్ ఓటింగ్ బృందాలను ఏర్పాటు చేసి, ఓటు సేకరణ ప్రక్రియపై వారికి శిక్షణ అందించడం జరిగిందన్నారు. ఒక్కో బృందంలో పీ.ఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్ తో పాటు వీడియో గ్రాఫర్, పోలీస్ సిబ్బంది ఉంటారని అన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి గోప్యతను పాటిస్తూ, పారదర్శకంగా హెూమ్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గం పరిధిలో కొనసాగే హెూమ్ ఓటింగ్ కు సంబంధించిన పూర్తి సమాచారాన్నిఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీలకు ముందస్తుగానే చేరవేశామని, హెూమ్ ఓటింగ్ ప్రక్రియను వారు కూడా పరిశీలించవచ్చని కలెక్టర్ సూచించారు. హెూమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకుని అర్హత పొందిన ఓటర్లు వారికి సూచించబడిన తేదీలలో ఇంటి వద్ద అందుబాటులో ఉంటూ, ఓటు హక్కును వినియోగించుకోవాలని, హెూమ్ ఓటింగ్ కోసం ఇంటి వద్దకు వచ్చే బృందాలకు సహకరించాలని కోరారు. కాగా, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అత్యవసర విభాగాలకు చెందిన మరో 86 మంది సైతం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించిన సంఘటన మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న ఆర్టీపే చెక్ పోస్ట్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం ... కామారెడ్డి పట్టణానికి చెందిన వెంకట్ (39) కామారెడ్డి పట్టణానికి వెళుతుండగా ఆర్టీపే చెక్ పోస్ట్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనగా అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

కోడెదూడలకు గడ్డి వితరణ


ట్రాక్టర్‌లో గడ్డిని తీసుకెళ్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశి శ్రీ సిద్ద రామేశ్వర ఆలయంలో ఉన్న కోడెదూడలకు దోమకొండ మండలానికి చెందిన లక్ష్మణ్ 89 గడ్డిమోపులను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు లక్ష్మణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

భానుడి భగభగ

- భయపడుతున్న ప్రజలు

నవతెలంగాణ-సదాశివనగర్

ఎండలు భగభగ మండుతున్నాయి. మే నెల ప్రారంభంతో భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ఇంట్లో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు.

జాన్కంపేట్‌లో చోరీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన రాచర్ల రాంబాబు అనే వ్యక్తి ఇంట్లో బీరువాలో దాచిన రూ.25వేల నగదుతో పాటు సెల్ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఎలక్ట్రిక్ టెక్నీషియన్ ఒకేషనల్ కోర్సులో స్టేట్ టాపర్‌గా సంతోష్


జి.సంతోష్

నవతెలంగాణ-మద్నూర్

2023-24 సంవత్సరానికి గానూ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఒకేషనల్ కోర్సులో స్టేట్ టాపర్‌గా డోంగ్లి మండలంలోని లింబూర్ గ్రామానికి చెందిన జి.సంతోష్ 1000 మార్కులకు గాను 925 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచారు. రాష్ట్రానికి పూర్తిగా మారుమూల గ్రామమైన లింబూర్ గ్రామాన్ని రాష్ట్రస్థాయికి నిలపడంతో ఆ విద్యార్థికి ఉమ్మడి మద్నూర్ మండలంలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సంతోష్ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించాడు. ఈ ఒకేషనల్ కోర్సును లింబూర్ విద్యార్థి బాన్సువాడలోని శ్రీ రేణుక ఒకేషనల్ జూనియర్ కళాశాలలో చేశాడు. ఒకేషనల్ కోర్సులు స్టేట్ టాపర్‌గా నిలిచినందుకు ఆ విద్యార్థి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఇంటింటా ప్రచారం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ, జెడ్పిటిసి ఆధ్వర్యంలో గురువారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ అభ్యర్థి సురేష్ శెట్కర్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, జడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, సర్పంచులు రాజయ్య, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, రామ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు సాయికుమార్, ఎల్లమయ్య, అశోక్, నగేష్, రాజు, ఫతియోద్దీన్, రఫీక్, ప్రసాద్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

10 లక్షల విలువ చేసే సిగరెట్ల డబ్బాలు చోరీ

- ఘటన స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి


వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి గంజి మార్కెట్ లో ఉన్న శ్రీ రాఘవేంద్ర ట్రేడర్స్ అనే సిగరెట్ల కంపెనీలో తెల్లవారుజామున సుమారు రెండు గంటల సమయంలో, గుర్తుతెలియని వ్యక్తులు కంపెనీలోకి చొరబడి 8 కార్టూన్ల సిగరెట్ డబ్బాలను దొంగలించారని పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. రాఘవేంద్ర టెండర్స్ యజమాని శశిధర్ గురువారం ఫిర్యాదు చేయగా డీఎస్పీ నాగేశ్వరరావు వెంటనే శ్రీ రాఘవేంద్ర టెండర్స్ కంపెనీ కార్యాలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించినట్టు చెప్పారు.

ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల విధులు, ఇతర అత్యవసర విధులు నిర్వహిస్తున్న 4,546 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకొనుటకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జుక్కల్ నియోజక వర్గంలో 1,081, ఎల్లారెడ్డి లో 1,298, కామారెడ్డి నియోజక వాసర్గంలో 2,167 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం జుక్కల్ నియోజక వర్గానికి సంబంధించి మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో, ఎల్లారెడ్డి నియోజక వర్గానికి సంబంధించి ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో, కామారెడ్డి నియోజక వర్గానికి సంబంధించి రెవిన్యూ డివిజల్ కార్యాలయంలో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పొందిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పొలిసు శాఖ అధికారులు ఈ నెల 4,5 తేదీల్లో ఆయా నియోజక వర్గాలందు కార్యాలయ పనివేళల్లో పోస్టల్ బ్యాలట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇతర పోలింగ్ సిబ్బంది అనగా ఓపిఓలు ఈ నెల 6,7 తేదీలలో ఆయా నియోజక వర్గాలలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలకు వెళ్లనప్పుడు తమ వెంట ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఫోటో ఐడి ప్రూఫ్, ఎన్నికల విధి కేటాయింపు ఉత్తర్వు ప్రతిని తప్పనిసరిగా తీసుకెళ్లాలని కలెక్టర్ తెలిపారు.

బియ్యం అక్రమ రవాణాపై నిఘా

- విస్తృతంగా దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నం
- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో బియ్యం అక్రమ రవాణా జరగకుండా విస్తృతంగా దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నామని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తరచుగా పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది, విజిలెన్సు బృందాలు, తహసీల్దార్లు జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తూ (పిడిఎస్.) రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న, స్టోరేజి చేస్తున్న పాయింట్‌లపై దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న చౌక ధరల దుకాణాలపై కేసులు నమోదు చేస్తూ ఆస్తులను స్వాధీన పరచుకుంటున్నామని పేర్కొన్నారు. జనవరి 2024 నుండి ఇప్పటి వరకు జిల్లాలో 531. 96 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేయడంతో పాటు 9 లక్షల 21 ఆస్తులను జప్తు చేసి కేసులు నమోదు చేశామని తెలిపారు. అక్రమ రవాణాకు సంబంధించి ఏదేని సమాచారం తెలిసిన, ఫిర్యాదు వచ్చిన మరుక్షణమే దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నామని, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఎళ్లవేళలా అప్రమత్తం చేస్తూ అక్రమ పీడీఎస్ బియ్యం రవాణా, స్టోరేజీలపై దాడులు చేసి 6 -ఎ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించామని చంద్ర మోహన్ తెలిపారు.

హెచ్చరికలు ప్రకటనలకే పరిమితమా?

- పోతున్న ప్రాణాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి


మృతి చెందిన శ్రీకాంత్ (ఫైల్)


రోడ్డుపైన ఉంచిన ధాన్యం కుప్ప

రహదరులపై పండించిన పంటలు ఆరబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు ప్రతి సారి జారీ చేస్తునే ఉన్నారు. కాని చర్యలు చేపట్టినట్లు ఎక్కడ కనబడటంలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత నెల 28న రాత్రి 9 గంటలకు డిచ్ పల్లి మండలంలోని అమృతాపూర్ గ్రామానికి చెందిన కుందేటి శ్రీకాంత్ ఖిల్లా డిచ్‌పల్లి గ్రామం నుండి అమృతాపూర్ గ్రామానికి వస్తుండగా రోడ్డుపైన వరి కుప్పగా పోసి ఉండడంవల్ల దాన్ని ఢీకొని కుందేటి శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇదే కాకుండా అంతకంటే ముందు కూడా చాలా చోట్ల వరి ధాన్యం కుప్పలు ఉండడంతో ఈవిషయం తెలియక కొందరు మృత్యువాత పడి కుటుంబాలు చిన్న భిన్నమైన ఘటనలు అనేకంగా ఉన్నాయి. డిచ్‌పల్లి మండలంలోని ముల్కంగి, ఖిల్లా డిచ్‌పల్లి, సుద్దపల్లి నుండి ధర్పల్లి మండలంలోని రామడ్గు వరకు, బీబీపూర్ తండాతోపాటు ఆయా గ్రామాల్లో ఇష్టానుసారంగా రహదారులపై ఆరబోసుకుంటూ ఎలాంటి హెచ్చరిక బోర్డులను పెట్టకుండా రేయింబవళ్ళు అలాగే వదిలి వేయడంతో లేని ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపడ్తే కుటుంబాలు చిన్నాభిన్నం కాకుండా కాపాడుకోవచ్చని, ఇంకొందరు ఆరబోసిన ధాన్యం మొత్తంగా ఎండిన సంచుల్లో నింపుకుని అక్కడే వదిలి వేయడం, రాత్రంతా చిమ్మ చీకటి, వీధి దీపాలు సైతం లేకపోవడం, ద్విచక్ర వాహనదారులకు దగ్గరకు వచ్చే వరకు కుప్పలు కనబడక ప్రమాదాలను కొని తెచ్చుకుంటు ఆసుపత్రుల పాలు కావడమే కాకుండా ప్రాణాలు కోల్పోతున్నారని పలువురు బాదితులు, వాహన దారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన రహదారులపై అరబోయ కుండా సంబంధిత శాఖ అధికారులు, పోలిసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీసులు సైతం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించే విదంగా చూడాల్సిన బాధ్యత ఎంతైన ఉంది.

తాగునీటి ఇబ్బందులు రావొద్దు

- ఉపాధికూలీలకు టెంట్లు, తాగునీటి వసతి కల్పించాలి
- పారిశుధ్య పనులు చేయించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తాగు నీరు, ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు, గ్రామాలలో పారిశుధ్యం, ఇంటి పన్నుల వసూళ్ళపై డిచ్ పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో పంచాయత్ రాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ, జిల్లా పంచాయతి అధికారి చక్రవర్తి తరుణ్ కుమార్, డిఆర్‌డిఓ పిడి సాయాగౌడ్‌లతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిచ్‌పల్లి, ఇందల్‌వాయి, ధర్పల్లి మండలాల్లోని అయా గ్రామాలకు చెందిన పంచాయతీ అధికారులు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించే విధంగా చూడాలని, ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలకు టెంట్లు, తాగు నీటి వసతి ఖచ్చితంగా కల్పించాలని అన్నారు. ఇదే కాకుండా కూలీలందరికీ ఓఆర్‌యస్, మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడి నుండి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఎండల నేపథ్యంలో వేకువజాము నుండి 12గంటల లోపలే ఉపాధి పనులు ముగిసే విధంగా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ డివిజన్ డిఎల్‌పీఓ. శ్రీనివాస్, డిచ్ పల్లి ఎంపిడిఓ రవీందర్, ఇందల్ వాయి ఎంపిడిఓ అనంత్ రావు, ధర్పల్లి ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్, రాజ్ కాంత్ రావు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా ఈ-పంచాయత్ డిపియం నరహరి, జిల్లా పంచాయతి అధికారి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

కుల సంఘాలకు ప్రత్యేక కార్పొరేషన్

- త్వరలో కమ్యూనిటీల నిర్మాణం
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు
- కాంగ్రెస్ పార్టీలో కుల సంఘాల నాయకుల చేరిక

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం కుల సంఘాలకు పెద్దపీట వేసిందని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐలాపూర్, మంభోజిపేట్ గ్రామాలకు చెందిన మున్నూరుకాపు, ముదిరాజ్ కుల సంఘాలు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కుల సంఘాల ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, కుల సంఘాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన కుల సంఘాల నాయకులు

గ్రామాలలో నీటిని పరిశీలించిన భూగర్భ జిల్లా శాఖ అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

గ్రామాలలో ప్రజలు స్వచ్ఛమైన నీటిని తాగడానికి అనువుగా కామారెడ్డి, రామారెడ్డి మండలలోని పలు గ్రామాలలో నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నామని భూగర్భ జిల్లా శాఖ సహాయ సంచాలకులు సతీష్ యాదవ్ అన్నారు. అందులో భాగంగా గురువారం కామారెడ్డి మండలంలోని పాత రాజంపేట్, అడ్లూరు, గర్గుల్, రామారెడ్డి మండల కేంద్రంలో నేషనల్ హైడ్రాలజి ప్రాజెక్టు కింద సంచార నీటి నాణ్యత గల పరీక్షలు నిర్వహించమని అన్నారు.


నీటిని పరిశీలిస్తున్న అధికారులు